# తగరపువలసలో భారతరత్న కర్పూరి ఠాగూర్ 39వ వర్ధంతి ఘనంగా నిర్వహణ



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :** విశాఖ జిల్లా తగరపువలసలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో భారతరత్న గ్రహీత, జననాయక్‌గా ప్రసిద్ధి చెందిన కర్పూరి ఠాగూర్ 39వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘానికి అనుబంధమైన తగరపువలస నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

సంఘం అధ్యక్షులు ఎర్రవరపు శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షులు ముసిడిపల్లి రమణ, జిల్లా అధ్యక్షులు కోడూరు గణపతి రావు, ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు, అధికార ప్రతినిధి బల్లంకి వెంకట్రావు, కోశాధికారి గోవాడ సురేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై కర్పూరి ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కర్పూరి ఠాగూర్ గారు సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేత అని కొనియాడారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సిల్లారపు ఎర్రిబాబు, గోవాడ దంతిశ్వరరావు, సిల్లారపు పైడ్రాజు, చెప్పాడా కృష్ణకుమార్, చెప్పాడా రామకృష్ణ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమం అనంతరం సంఘ నాయకులు కర్పూరి ఠాగూర్ గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అనకాపల్లి జిల్లాలో మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి

**బ్రాండిక్ అచ్యుతాపురం యూనిట్‌లో అవగాహన సదస్సు**

**అనకాపల్లి (అచ్యుతాపురం), పెన్ పవర్ ఫిబ్రవరి 17:** పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల భద్రతను అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుంటున్నామని జిల్లా పోలీస్ యంత్రాంగం స్పష్టం చేసింది. జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఆదేశాల మేరకు అచ్యుతాపురం ప్రాంతంలోని బ్రాండిక్స్ సంస్థ యూనిట్2లో మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ. శ్రీనివాసులు పర్యవేక్షణలో జరిగింది. వన్ స్టాప్ సెంటర్ ఎస్సై పి. రాములమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళా రక్షణకు సంబంధించిన చట్టపరమైన అంశాలు, అందుబాటులో ఉన్న సేవలు, అత్యవసర సహాయ మార్గాలపై వివరించారు.

'శక్తి' యాప్‌పై అవగాహన అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు తక్షణ పోలీసు సహాయం అందించేందుకు రూపొందించిన 'శక్తి' మొబైల్ యాప్‌ను ప్రతి మహిళా ఉద్యోగి తమ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ఒక్క బటన్ నొక్కితే సమీప పోలీసు సిబ్బందికి సమాచారం చేరి, నిమిషాల్లో సహాయం అందుతుందని తెలిపారు ఎంఎండిజిటల్ యుగంలో పెరుగుతున్న



సైబర్ నేరాల నేపథ్యంలో అపరిచితులతో వ్యక్తిగత సమాచారం, ఫోటోలు లేదా ఓటీపీలు పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియా వేదికల ద్వారా మోసాలకు గురయ్యే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కోరారు.

టోల్ ఫ్రీ సేవలు 181

వేధింపులు, హింస లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు 181 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఉచిత న్యాయ, వైద్య, కౌన్సెలింగ్ సేవలు పొందవచ్చని ఎస్సై రాములమ్మ తెలిపారు. ఫిర్యాదుదారుల



వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. "మీ భద్రతే మా బాధ్యత. వేధింపులను మౌనంగా భరించవద్దు. ధైర్యంగా పోలీసులను ఆశ్రయించండి" అని జిల్లా పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు. సదస్సు అనంతరం మహిళా ఉద్యోగులు అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చి, చట్టపరమైన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# కళా సేవలో నందవరపు సోములు 39 ఏళ్లు







**సమాజ సేవకు అభినందనల వెల్లువ**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :** విశాఖ నగరంలోని గ్రేటర్ విశాఖ 92వ వార్డు పరిధిలోని పద్మనాభ నగర్‌కు చెందిన నందవరపు సోములు గత 39 సంవత్సరాలుగా నిరంతర సామాజిక సేవతో ప్రజల మన్ననలు పొందుతున్నారు. యువకుడిగా ప్రారంభమైన ఆయన సేవా ప్రయాణం, నేడు అనేక సంస్థల రూపంలో విస్తరించి వేలాది మందికి అండగా నిలుస్తోంది.

**సేవా ప్రస్థానం ప్రారంభం..**

1987లో డా.వి.ఎస్.కృష్ణా గవర్నమెంట్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న రోజుల్లోనే ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్‌గా సేవలు ప్రారంభించారు. ఆ సమయంలో ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో మదర్ తెరెసాను కలవడం ఆయన జీవితాన్ని మలుపుతిప్పింది. ఆమె సేవాస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని వయోజన విద్య, అక్షరజ్యోతి, మొక్కల నాటకం, శ్రమదానం వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆయన సేవలను మెచ్చిన అధికారులు ప్రత్యేక శిక్షణకు ఎంపిక చేసి, ఉత్తమ ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్ అవార్డుతో సత్కరించారు.

**గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర..**

1989లో పద్మనాభ నగర్ గ్రామాభ్యుదయ యువజన సేవా సంఘాన్ని స్థాపించి గ్రామ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. పాఠశాల భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, బోర్లు, ప్రజా కుళాయిలు, రహదారులు, కాలువలు వంటి మౌలిక వసతుల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. పేదలకు గృహాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంలో విశేష కృషి చేశారు.

**మహిళా శక్తీకరణ ద్వాక్రా విస్తరణ..**

వివిధ కాలనీలలో మహిళా సంక్షేమ సంఘాల స్థాపనకు కృషి చేసి, ఆయన సారథ్యంలో వందలాది ద్వాక్రా గ్రూపులు ఏర్పడ్డాయి. మహిళలకు ఉపాధి శిక్షణలు, రుణ సదుపాయాల కల్పన ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించేలా చేశారు.

**విద్యా పర్యావరణ సేవలు..**

పేద విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్, యూనిఫార్ములు, పౌష్టికాహారం అందించడం, ఉత్తమ విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ స్థాపనలోనూ పాత్ర వహించారు. పర్యావరణ పరిరక్షణ, జలసంరక్షణ, ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టారు.

**వికలాంగులు వృద్ధులకు అండగా..**

2002లో శ్రీ బాపూజీ వికలాంగుల సంక్షేమ సేవాసంఘం స్థాపించి, పింఛన్లు, అంత్యోదయ కార్డులు, అన్నపూర్ణ పథకం వంటి ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేలా కృషి చేశారు. వారికి అవసరమైన పరికరాలు, వస్త్రాలు అందించారు.

**మథర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్..**

2008లో "మథర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్"ను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను విస్తరించారు. క్రీడా పరికరాల పంపిణీ, జాతీయ మహానుభావుల జయంతులు నిర్వహించడం వంటి కార్యక్రమాల ద్వారా యువతలో చైతన్యం కలిగిస్తున్నారు.

**కళా సేవాపీఠం కళాకారులకు అండ..**

2016లో గోపాలపట్నం కళాసేవాపీఠం స్థాపించి ప్రతి సంవత్సరం "ఉగాది పురస్కారాలు" అందిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరిస్తున్నారు. కళారంగంలో సేవలందించినవారికి నివాళులు అర్పించడం కూడా వారి ప్రత్యేకత.

**రాజకీయ సామాజిక బాధ్యతలు..**

ప్రస్తుతం అనేక యువజన, మహిళా సంఘాలకు గౌరవాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా సేవలందిస్తున్నారు.



**ప్రశంసలు అవార్డులు..**

1988లో ఎన్.ఎస్.ఎస్. బెస్ట్ వాలంటీర్ అవార్డు నుండి ప్రారంభమైన ఆయన అవార్డుల ప్రస్థానం అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలతో కొనసాగింది. 1989లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చేత ప్రశంసలు అందుకున్నారు. 2001లో నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సత్కారం పొందారు. 2011లో ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమింగ్ చేత రాష్ట్ర ఉత్తమ పౌరుడు అవార్డు అందుకున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ఎన్టీఆర్ శతజయంతి పురస్కారం, ఘంటసాల శతజయంతి పురస్కారం, జాతీయ రత్న, సేవా భూషణ్, రాష్ట్ర కళాజ్యోతి, సమాజ మానవతా పురస్కారాలు తదితర గౌరవాలు అందుకున్నారు.

**సమాజానికి ఆదర్శం..**

నందవరపు సోములు సేవా ప్రయాణం ఒక వ్యక్తి సంకల్పం ఎంత పెద్ద మార్పు తీసుకురాగలదో చూపిస్తుంది. గ్రామాభివృద్ధి నుంచి కళారంగ ప్రోత్సాహం వరకు విస్తరించిన ఆయన సేవలు భావితరాలకు మార్గదర్శకం. 39 ఏళ్ల నిరంతర సేవా ప్రస్థానానికి సమాజం నుంచి అభినందన మణిహారాల వెల్లువ కొనసాగుతోంది.

## కె.కోటపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు

**అనకాపల్లి జిల్లా ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిసిన కె.కృష్ణ**



**అనకాపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :** అనకాపల్లి జిల్లా పోలీసు శాఖలో పరిపాలనా బలపాటుకు మరో అడుగు పడింది. కె.కోటపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె.కృష్ణ, జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ ఎస్పీకి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సమావేశంలో నూతన సీఐకి ఎస్పీ తుహిన్ సిన్హా శుభాకాంక్షలు తెలుపుతూ, విధి నిర్వహణలో అనుసరించాల్సిన ముఖ్య అంశాలపై దిశానిర్దేశం చేశారు. సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి రాజీ పడకూడదని, ప్రజలలో భద్రతా భావన పెంపొందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి రవాణా, మహిళలపై మరియు బలహీన వర్గాలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వక వైఖరి పాటిస్తూ, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

రాత్రి వేళల్లో గస్తీ బలపరచడం ద్వారా నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ గారు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం పోలీసు శాఖ ముఖ్య బాధ్యత అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా విధులు నిర్వహిస్తానని, శాంతి భద్రతల పరిరక్షణలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశం ద్వారా కె.కోటపాడు సర్కిల్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు మరింత దృఢమైన చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టమైంది.

## ఆనందపురం కేజీబీవీలో డీఈవో ఆకస్మిక తనిఖీ





**ఆనందపురం, పెన్ పవర్,ఫిబ్రవరి 17:** ఆనందపురం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్ ఆకస్మిక తనిఖీ నిర్వహించి పాఠశాల సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే పాఠశాలకు చేరుకుని వసతి గృహం, వంటగది, భోజన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

మధ్యాహ్న భోజనం తయారీ విధానం, వంటగది పరిశుభ్రత, కూరగాయల నాణ్యత, ఆహార పదార్థాల నిల్వ విధానం, మెనూ అమలు తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి భోజన నాణ్యత, సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.

పోషకాహార ప్రమాణాలు తప్పకుండా పాటించాలని, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని వంట సిబ్బందికి హెచ్చరించారు. వంటగది పరిసరాలు శుభ్రంగా ఉంచడం, ఆహార నిల్వలో జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

ఈ ఆకస్మిక తనిఖీతో పాఠశాల యాజమాన్యం మరింత జాగ్రత్తలు చేపట్టింది. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకే ప్రథమ ప్రాధాన్యత అని డీఈవో తెలిపారు.

